## క్లుప్తంగా

### నూతన కమిటీ నియామకం



నూతన కమిటీ సభ్యులు తదితరులు

**మంచాల:** ముస్లిం మైనార్టీ కమిటీ ఆరుట్ల గ్రామం నూతన అధ్యక్షుడిగా మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ యూసుఫ్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గ్రామంలోని నూర్ మసీద్‌లో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా యూసుఫ్, గౌరవ అధ్యక్షులుగా జానీపాష, సలాంబాయ్, ప్రధాన కార్యదర్శిగా బాబు మీయా, ఉపాధ్యక్షులుగా ఇస్మాయిల్, ఫయాస్, ఆసీఫ్ ఖాన్, ప్రధాన సలహాదారులు జిలానీ బాయ్, అక్బర్ బాయ్, సోషల్ మీడియా కార్యదర్శులుగా ఖాజా, హఫేజ్, కోశాధికారిగా జహంగీర్, మరో 11 మందిని సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

### వైభవంగా బీరప్ప పండుగ



స్వామివారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**యాచారం:** మండల పరిధి మల్కీజ్‌గూడ గ్రామంలో ఆదివారం శ్రీబీరప్పస్వామి, కమరావతి దేవీల పండుగ ఘనంగా జరిగింది. కుర్మ సంఘం ఆధ్వర్యంలో భక్తులు నెత్తిన బోనంతో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా వెళ్లి, స్వామివారికి నైవేద్యం సర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాష, గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, శంకర్, మల్లేష్, బోడ అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ మల్లురవి

**ఆమనగల్లు:** మండల పరిధి ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన వల్లపుదాసు బాలకిష్టయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి.. ఆదివారం బాధితున్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ తదితరులు ఉన్నారు.

### మురుగు నిలిచి.. దుర్గంధం వ్యాపించి



ఇళ్ల మధ్యన నిలిచిన మురుగునీరు, అందులో ఉన్న బోర్‌మోటార్

**కేశంపేట:** మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులోని తెట్టేకుంటతండాలో మురుగునీరు ఇళ్ల మధ్యలో చేరి దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నిలిచే ప్రదేశంలోనే గ్రామ పంచాయతీకి సంబంధించిన బోర్ కూడా ఉంది. వ్యర్థ జలాలు బోర్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని, ఆ నీటినే తాగుతున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇళ్ల మధ్యలోనే మురుగునీరు నిలవడంతో దుర్గంధంతో పాటు దోమబెడద పెరుగుతోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

### 'సైనికులను అవమానించడం బాధాకరం'

**మొయినాబాద్‌రూరల్:** సైనికులను అవమానించడం బాధాకరమని బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా కన్వీనర్ ఎలగని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ.. భారత సైనికులను అవమానపరిచేలా.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే ఇతర నాయకులు హేళన చేస్తూ మాట్లాడడం బాధాకరమన్నారు. దేశాన్ని రక్షించుకునేందుకు పార్టీలు ముఖ్యం కాదని, ఐకమత్యంగా ఉన్నప్పుడే సైనికుల్లో ధైర్యం నింపగలుగుతామన్నారు. ఇకనైనా దేశ రక్షణలో ఉన్న వారిపై ఎవరు విమర్శలు చేయొద్దని కోరారు.

# మోక్షం కల్పించి.. వదిలేసి

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించిన మడిగెల పరిస్థితి. రూ.1.20 కోట్లు వెచ్చించి మొదలు పెట్టిన దుకాణ సముదాయ నిర్మాణ పనులను.. తొలుత అసంపూర్తిగా వదిలేశారు. ఆ తరువాత మోక్షం కల్పించారు. అనంతరం యాక్షన్ వేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు.

**నిరుపయోగంగా దుకాణ సముదాయం**

- ఆదాయం కోల్పోతున్న వ్యవసాయ మార్కెట్
- ఓపెన్ యాక్షన్ విస్మరించిన అధికార యంత్రాంగం
- మడిగెల కోసం ఎదురు చూస్తున్న వ్యాపారులు



ప్రారంభోత్సవానికి నోచుకోని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోని దుకాణ సముదాయం



**ఇబ్రహీంపట్నం:** స్థానిక మార్కెట్ యార్డు ఖాళీ స్థలంలో 2022 సంవత్సరంలో మార్కెటింగ్ శాఖ రూ.1.20 కోట్లతో 17 మడిగెల నిర్మాణ పనులు చేపట్టింది. ఇంజినీరింగ్, విద్యుత్ అధికారుల అలసత్వం కారణంగా.. చివరి దశ పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. పనుల ఆటంకం నేపథ్యంలో గతేడాది 'సాక్షి'లో 'మడిగెలకు మోక్షమెప్పుడో' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి.. స్పందించిన అధికారులు.. వడివడిగా మిగతా నిర్మాణ పనులను పూర్తి చేశారు. పూర్తి చేసి ఆరు నెలలు అయినా.. వాటిని ప్రారంభించి, ఓపెన్ టెండర్లను పిలిచేందుకు మార్కెట్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

**ప్రారంభిస్తే.. ఏటా రూ.40 లక్షల ఆదాయం!**

ఇబ్రహీంపట్నం– నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై బస్టాండ్ సమీపంలోని మార్కెట్ స్థలంలో నిర్మించిన మడిగెలకు మంచి డిమాండ్ ఉంది. ఓపెన్ యాక్షన్ పెడితే ఒక్కో మడిగ రూ.20 వేలకు పైగానే పలికే అవకాశం ఉంది. దాంతో ప్రతి నెల రూ.3.50 లక్షల నుంచి 4 లక్షలు, ఏడాదికి సుమారు రూ.35 నుంచి 40 లక్షల వరకు అదనంగా మార్కెట్‌కు ఆదాయం సమకూరేది. ఇలా కాసులు కురిపించే దుకాణ సముదాయాన్ని త్వరగా ప్రారంభించాలన్న ఆలోచనను సంబంధిత అధికారులు విస్మరిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మడిగెలకు ఓపెన్ యాక్షన్ ఎప్పుడెప్పుడాని చిన్న, పెద్ద వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. వాటిల్లో ఏ వ్యాపారం చేసినా విజయం సాధిస్తామనే నమ్మకంతో ఆశగా ఉన్నారు. గతంలో ఈ మార్కెట్ యార్డులో నిర్మించిన 53 మడిగెలకు ఆ కాలంలో నిర్వహించిన ఓపెన్ యాక్షన్‌లో ప్రతినెల అద్దె రూపంలో రూ.5 లక్షల ఆదాయం వస్తోంది. ఇప్పుడు పెరిగిన కిరాయి ప్రకారం కొత్త మడిగెలకు ఓపెన్ టెండర్లలో భారిగానే ఆదాయం రానుంది.

**ఎమ్మెల్యే గారు.. దృష్టిపెట్టండి**

మడిగెలను ప్రారంభించి, టెండర్లు పిలిచే అంశంపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి నెల అద్దె రూపంలో వచ్చే ఆదాయంతో వ్యవసాయ మార్కెట్ మరింత అభివృద్ధి చెందుతుందని, సంబంధిత అధికారులతో మాట్లాడి, త్వరితగతిన ప్రక్రియ పూర్తి అయ్యేలా చూడాలని సూచిస్తున్నారు.

**ఓపెన్ యాక్షన్‌కు సిద్ధం**



మడిగెల నిర్మాణం పూర్తి అయింది. ఓపెన్ యాక్షన్‌కు సిద్ధంగా ఉన్నాయి. దీనికి సంబంధించి జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ శాఖ నుంచి ఆదేశాలు రాగానే టెండర్ ప్రక్రియ పూర్తిచేస్తాం. వచ్చే నెలలో సముదాయం ప్రారంభం అవుతుంది.

– సంతోష్‌కుమార్, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, ఇబ్రహీంపట్నం

# తొలి తెలుగు కవయిత్రి మొల్ల

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మొల్లమాంబ విగ్రహావిష్కరణ



మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

**ఆమనగల్లు:** తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని, ఆమె రచించిన రామాయణం సామాన్య ప్రజలకు అర్థమయ్యేరీతిలో ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొల్లమాంబ విగ్రహాన్ని ఆదివారం ఆ సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిలు ఆవిష్కరించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాల్మీకి రాసిన సంస్కృత రామాయణాన్ని.. మొల్లమాంబ తెలుగులోకి సరళమైన భాషలో అనువదించారని పేర్కొన్నారు. దీంతో శ్రీ కృష్ణ దేవరాయలు మొల్లకు కవిరత్న బిరుదు ఇచ్చారని గుర్తు చేశారు. కుమ్మరి కుటుంబంలో పుట్టిన గొప్ప కవయిత్రి మొల్ల అని కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్, రాష్ట్ర కోశాధికారి రాజలింగం, నాయకులు తిరుమల వెంకటేశం, వీరేశం, సాయిలు, గోవర్ధన్, నరేశ్, దుర్గాపురం నగేశ్, వెంకటేశ్, మల్లేశ్, బాలయ్య, గణేశ్, మోహన్‌కుమార్, సుధాకర్, వీరయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలు 1600.. అర్హులు 60

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మాజీ ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**కడ్తాల్:** ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నిరుపేదలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, మైనార్టీ నాయకులు లాయక్‌అలీతో కలిసి ఆయన మాట్లాడారు. కడ్తాల్ గ్రామంలో సుమారు 1600 మంది ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోగా.. 60 మందిని మాత్రమే అర్హులుగా పేర్కొంటూ లబ్ధి చేకూర్చారని పేర్కొన్నారు. తిరస్కరణకు గురైన వారి వివరాలు, మిగతా వారు ఎంపిక కాకపోవడానికి కారణాలేమిటో పంచాయతీ కార్యాలయంలో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు, ఇందిరమ్మ పేరుతో మరో కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలులో సర్కారు పూర్తిగా విఫలమైందని, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే అట్టడుగు స్థాయికి తెలంగాణ దిగజారిపోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రయ్య, ఇర్షాద్, వెంకటేశ్, నాగార్జున్, మహేశ్, కృష్ణ, మహేశ్, భాస్కర్, మహేశ్ నాయక్ ఉన్నారు.

# 'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

- మహాధర్నాను జయప్రదం చేయండి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య



కర పత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**మాడ్గుల:** ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి కందుకూరి జగన్‌లు ఆరోపించారు. ఆదివారం మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి మహాధర్నా కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి వ్యతిరేకంగా కేంద్రం మూడు నల్ల చట్టాలు తెచ్చిందని, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తుందని విమర్శించారు. ఉపాధి కూలీలకు రూ.307లు చెల్లించాలని చట్టం చేసిందని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా రూ.200 మాత్రమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. ప్రతి కూలీకి రూ.350లు తప్పని సరిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కొలతలతో సంబంధం లేకుండా రూ.700 వేతనం ఇవ్వాలని కోరారు. పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు అందడం లేదని, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, పనిముట్లు, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాల కల్పన తదితర డిమాండ్ల కోసం ఈ నెల 30న చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం కార్యదర్శి పాషా, నాయకులు బుచ్చయ్య, సంధ్య, వెంకటమ్మ, కృష్ణమ్మ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### 'ఇందిరమ్మ' పథకంలో మాలలకు అన్యాయం

**మాడ్గుల:** ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని, మాడ్గుల మండల కేంద్రంలో 120 మాలల కుటుంబాలు ఉండగా.. ఏ ఒక్కరికీ ఇవ్వలేదని మాల కళాకారుల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు గోరటి రమేష్ ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దళితులకు అన్యాయం చేసినట్టే ప్రస్తుత సర్కార్ వ్యవహరిస్తుందని విమర్శించారు. కటిక పేదరికంలో ఉండి, సొంతింటి కోసం ఎదురు చూసిన వారిని కాంగ్రెస్ మోసం చేసిందని పేర్కొన్నారు. అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

### ప్రభుత్వ భూమి పరిశీలన

**నందిగామ:** మండల కేంద్రమైన నందిగామలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా ఉన్నత పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నందున ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఇటీవల పాఠశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారని గుర్తుచేశారు. ప్రాథమిక పాఠశాలను వేరోక చోట నిర్మించాలని సంకల్పించామని, అందులో భాగంగానే రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలకు అనుకూలమైన స్థలాలు ఇంకా ఎక్కడ ఎక్కడ ఉన్నాయో చూసి స్థలాన్ని ఎంపిక చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీటీసీలు దేపల్లి కుమార్‌గౌడ్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# సబర్బన్ బస్ సౌకర్యం కల్పించండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో మాట్లాడుతున్న చైర్ పర్సన్ గీత

**మంత్రి పొన్నంకు మార్కెట్ చైర్‌పర్సన్ వినతి**

**కడ్తాల్:** హైదరాబాద్ నుంచి కడ్తాల్, ఆమనగల్లు వరకు సిటీ సబర్బన్ బస్సులు ఏర్పాటు చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలో మంత్రిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యల గురించి వివరించారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. షాద్‌నగర్– కడ్తాల్ రూట్లో షాద్‌నగర్ డిపోనకు చెందిన సర్వీసులు నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఈ మార్గంలో బస్సులు తిప్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు.. నగరానికి సమీపంలోని కడ్తాల్, ఆమనగల్లు వరకు సిటీ సబర్బన్ బస్సులు ఏర్పాటు చేయాలని, తద్వారా విద్యార్థులకు, ఉపాధి రీత్యా, ఇతర అవసరాల కోసం నగరానికి వెళ్లే వారికి సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని చైర్ పర్సన్ తెలిపారు.

# ముగిసిన క్రికెట్ లీగ్



కప్పుతో తమిళనాడు సౌత్ జట్టు

**తుర్కయంజాల్:** సత్యసాయి జయంతిని పురస్కరించుకుని ఆ సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి నిర్వహించిన క్రికెట్ లీగ్ మ్యాచ్ ఆదివారంతో ముగిసింది. తుది పోరులో తెలంగాణ జట్టుతో తలపడిన తమిళనాడు విజయం సాధించింది. జ్ఞాపికను సొంతం చేసుకుంది. ఈ లీగ్‌లో మొత్తం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నార్త్, కర్ణాటక సౌత్, తమిళనాడు సౌత్, నార్త్, కేరళతో పాటు.. గ్రామం, జిల్లా, రాష్ట్రం, జోనల్ లెవల్ మొత్తం 850 జట్లు పాల్గొన్నాయని సంస్థ సభ్యులు పేర్కొన్నారు. జోనల్ లెవల్‌లో గెలుపొందిన జట్ల మధ్య ఆగస్టు 15 నుంచి 17 వరకు పుట్టపర్తిలో యూనిటీ కప్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అంతర్జాతీయ ఎంపైర్ వి.కె.రామస్వామి, మాజీ చీఫ్ సెలక్టర్ ఎం.ఎస్.కె.ప్రసాద్, సేవా సంస్థల జోనల్ అధ్యక్షుడు ముకుందన్, నేషనల్ క్రికెట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం



విజేత జట్టుకు నగదు అందజేస్తున్న వాసుదేవారెడ్డి

**పహాడీషరీఫ్:** మామిడిపల్లి ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ 7వ సీజన్ విజేతగా ఆర్‌బీఎం వారియర్స్ జట్టు, రన్నరప్‌గా రెడ్‌బుల్స్ జట్టు నిలిచాయి. బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 23వ తేదీన ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఏడు జట్లు మూడునెలల పాటు ఆడాయి. ఈ సందర్భంగా గ్రామ ఆలయాల కమిటీ చైర్మన్ ఎడ్ల వాసుదేవారెడ్డి విజేత జట్టుకు రూ.35వేలు, రన్నరప్ జట్టుకు మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణుకుమార్‌గౌడ్ రూ.25వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్ నిర్వహణలో మాజీ కార్పొరేటర్ సుక్క శివకుమార్, గ్రామ నాయకులు నిమ్మల నరేందర్‌గౌడ్, దశరథ, లిక్కి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి వినయ్ యోగేందర్‌రెడ్డి సహకారం అందించారు. ఈ సందర్భంగా వాసుదేవారెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా కూడా స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు దిలీప్ కుమార్, కోట్ల కృష్ణ, పెరమోని నరేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

**షాబాద్:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి సతీమణి కవితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆస్పల్లిగూడ గ్రామంలో నిర్వహించిన బీరప్ప ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవాలకుగాను రూ.51వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం

**షాద్‌నగర్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ఇళ్లు లేని నిరుపేదల కల సాకారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారులకు శ్రీకాంత్‌రెడ్డి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని వెల్లడించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్జున్, నాయకులు సురేష్‌గౌడ్, హరికృష్ణయాదవ్, సాయికుమార్, రమేశ్‌గౌడ్, మల్లేశ్ యాదవ్, అశోక్, గోదా రమేశ్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో నాటి విద్యార్థులు

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**మాడ్గుల:** పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. మండల పరిధి కలకొండ గ్రామం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010– 2011 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బాల్య మిత్రులు, పుష్కర కాలం అనంతరం ఒకే వేదికగా సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, చందు, సత్యరాములు, రమేష్, సుందర్, ముత్యంరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెరపైకి పల్లె పోరు

- ప్రభుత్వ ప్రకటనలతో నేతల్లో చిగురిస్తున్న ఆశలు
- పార్టీ శ్రేణులతో విస్తృత సమావేశాలు
- ఆశావహుల సందడి..
- రిజర్వేషన్లు, నోటిఫికేషన్ కోసం ఆరా



పంచాయతీ కార్యాలయం

**అబ్దుల్లాపూర్‌మెట్:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తరఫున వస్తున్న ప్రకటనలతో పంచాయతీ పోరు తెరపైకి వస్తోంది. దీంతో పల్లెల్లో కొంతకాలంగా స్తబ్దుగా రాజకీయం.. వేడెక్కుతోంది. రాజకీయ నేతలు, ఆశావహుల్లో ఆరాటం మొదలయింది. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా.. ప్రజల్లోకి ఎప్పుడు వెళ్లాలా అని ఉవ్విళ్లూరుతున్నారు.

**ముందు జెడ్పీనా.. పంచాయతా?**

గత పాలకవర్గాల గడువు ముగిసి ఏడాదిన్నర కాలం గడిచింది. నాటి నుంచి ఇదిగో ఎన్నికలు అంటూ.. ప్రభుత్వం పలుమార్లు సంకేతాలు ఇచ్చినా.. పలు కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. ప్రత్యేక అధికారుల పాలనతో పంచాయతీల పాలనను నెట్టుకోస్తోంది. తాజాగా వినిపిస్తున్న ప్రభుత్వ ప్రకటనలు, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా తాము సిద్ధమేనని ఎన్నికల సంఘం చెబుతున్న మాటలతో నేతల్లో హడావుడి మొదలయింది. పోటీ చేసే అభ్యర్థుల కోసం సర్పంచ్, వార్డు సభ్యుల వారీగా గుర్తులను ఎంపిక చేయడంతో పాటు ఎంపీటీసీ స్థానాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను కూడా అధికారులు ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలతో స్థానిక ఎన్నికల సమయం ఆసన్నమైందనే భావన ప్రస్తుతం నెలకొంది. దీంతో పీసీసీ నేతలు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీ శ్రేణులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పంచాయతీ పోరు గురించి చర్చిస్తున్నారు. కాగా జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు ముందు నిర్వహిస్తారా? పంచాయతీ ఎన్నికలు ముందు నిర్వహిస్తారా? అనేది స్పష్టత రావాల్సి ఉంది.

**ఎదురుచూపులు**

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నేతలు తమ గ్రామంలో ఏ రిజర్వేషన్ వస్తుందోనని ఆత్రతగా ఎదురుచూస్తున్నారు. గ్రామ జనాభా ప్రకారం ఆ ఊరిలో వచ్చే రిజర్వేషన్ ఏది ఉండవచ్చు అనే సందేహాలను తీర్చుకునేందుకు ఆశావహులు అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 18 గ్రామాల్లో.. నాలుగింటిని సమీప పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ఆ గ్రామాల్లోని రెండు పంచాయతీల్లో గతంలో ఎస్సీ రిజర్వు ఉంది. అయితే ఆ రెండు ఎస్సీ స్థానాలను ప్రస్తుతం మిగిలిన 14 పంచాయతీల్లోని ఏ గ్రామంలో రిజర్వు చేస్తారనే సందేహంలో నేతలు ఉన్నారు. అటు రిజర్వేషన్లు ఫైనల్ కాక, మరో వైపు రిజర్వేషన్ల కోసం.. ఇంకో వైపు ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు జారీ చేస్తుందోనని నేతలు ఎదురు చూస్తున్నారు.

**ఆ పంచాయతీల్లో ఎన్నికలు**

మండలంలోని 14 పంచాయతీలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 18 గ్రామాలకు 4 పంచాయతీలను (తారమతిపేట, బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్) పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. మిగతా 14 గ్రామాల్లోని కొన్నింటిని కలిపి నగర పంచాయతీగా మార్పు చేస్తారన్న ప్రచారం జరిగినప్పటికీ.. మూడు మాసాల క్రితం ఎంపీటీసీ స్థానాల కోసం అధికారులు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెల్లడించడంతో ఈ సారి 14 గ్రామాల్లో సర్పంచి ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని జిల్లా స్థాయి అధికారి ఒకరు పేర్కొన్నారు.